# రేవంత్ ఓ బ్రోకర్

- ఏనుగు రవీందర్‌రెడ్డి బట్టేబాజ్.. ■ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రూ. 5 కోట్లకు అమ్ముడు పోయిండు
- ముస్లింలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు ■ కేసీఆర్‌తోనే మైనారిటీలకు న్యాయం
- బాన్సువాడ నియోజకవర్గస్థాయి ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం వేదికపై హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంపీ బీబీపాటిల్

బాన్సువాడ, నవంబర్ 20 : పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్ అని, ఎల్లారెడ్డి నుంచి వచ్చిన ఏనుగు రవీందర్‌రెడ్డి బట్టేబాజ్ అని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామ శివారులో సోమవారం బాన్సువాడ నియోజకవర్గస్థాయి ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హోం శాఖ మంత్రితోపాటు స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను 2009లోఎమ్మెల్సీగా పోటీ చేసినప్పుడు ఏనుగు రవీందర్‌రెడ్డి రూ.5 కోట్లకు అమ్ముడుపోయి వ్యతిరేకంగా ఓటు వేశాడని మండిపడ్డారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న పోచారం తనకే ఓటేశారని మంత్రి గుర్తుచేశారు. రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా అయన మనసు మొత్తం బీజేపీలోనే ఉందన్నారు. ఎల్లారెడ్డి ప్రజలు తంతే బాన్సువాడలో వచ్చి పడ్డాడని, ఇక్కడి నుంచి కూడా తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

**పోచారం మైనారిటీల పక్షపాతి..**

పోచారం శ్రీనివాసరెడ్డి మైనారిటీల పక్షపాతి అని మంత్రి తెలిపారు. వారికోసం కోట్లాది రూపాయలు కేటాయించారని, డబుల్‌బెడ్ రూం ఇండ్లు మంజూరు చేశారని వివరించారు. మంచి మనసున్న నంబర్‌వన్ లీడర్ పోచారం అని, చిన్ననాటి ముస్లిం మిత్రుడు చనిపోతే అసెంబ్లీ సమావేశాలను కూడా వదిలి వచ్చిన గొప్ప స్నేహితుడని కొనియాడారు. తన దోస్త్.. పోచారానికి మద్దతిచ్చేందుకే ఇక్కడి వచ్చినట్లు మంత్రి చెప్పారు. కాంగ్రెస్ 50 పాలనలో మైనారిటీలకు చేసిందేమీ లేదన్నారు. ముస్లింల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేశారు. రాష్ట్రంలో కేవలం 12 రెసిడెన్షియల్ స్కూళ్లు ఉండేవని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక 204 మైనారిటీ గురుకులాలను ఏర్పాటు చేసి లక్షా 20వేల మందికి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. సుమారు 5300 మంది మైనారిటీ విద్యార్థులకు ఉన్నత చదువులు, 2.77 లక్షల కుటుంబాలకు షాదీముబారక్ పేరిట చెక్కులు అందజేసినట్లు చెప్పారు. కేసీఆర్‌తోనే మైనారిటీలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సురేందర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ముస్లిం కుటుంబాలు

## కడుపులో పెట్టుకొని కాపాడుకుంటా: పోచారం

తనను మరోసారి ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టుకొనికాపాడుకుంటానని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంచి పనులు, పేదలకు సేవలందించే నాయకుడిని ఆలోచించి ఎన్నుకోవాలని సూచించారు. ముస్లింలకు బాన్సువాడ నియోజకవర్గంలో ఎంతో ప్రాధాన్యమిచ్చామని చెప్పారు. ఈద్గాలు, శ్మశానాల ప్రహరీలు, షాదీఖానాలకు భారీగా నిధులు కేటాయించానని తెలిపారు. మైనారిటీ గురుకులాలు, ఉర్దూ మీడియం కాలేజీలు ఏర్పాటు చేయించామన్నారు. 11వేల డబుల్ బెడ్ రూం ఇండ్లలో 2500 ఇండ్లు ముస్లింలకే కేటాయించానని వివరించారు. ఎల్లారెడ్డిలో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా అని కాంగ్రెస్ అభ్యర్థి రవీందర్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. భూ ఆక్రమణలు, లంచాలు, దౌర్జన్యాలు చేయడంతోనే అక్కడి ప్రజలు గత ఎన్నికల్లో ఓడించారని తెలిపారు. అక్కడ అభివృద్ధి చేయనోడు ఇక్కడెలా చేస్తాడని అన్నారు. ఏనుగు.. కాషాయ పార్టీనుంచి వచ్చినవాడని, షర్టు విప్పితే బీజేపీ బనియనే కనిపిస్తుందని అన్నారు. తనకు ఎలాంటి వ్యాపారాలు, వ్యాపకాలు లేవని, ప్రజాసేవే తన జీవితమని అన్నారు. తన పిల్లలకు కూడా ఎలాంటి ఆస్తులూ ఇవ్వలేదని తెలిపారు. తనను మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

---


- రాష్ట్రంలో ఎగిరేది గులాబీ జెండానే..
- నమస్తే తెలంగాణతో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్

**నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW**

**సర్వమత సంరక్షకుడు** సీఎం కేసీఆర్. బీఆర్‌ఎస్ హయాంలో అన్ని మతాలకు సరైన గౌరవం దక్కింది. పండుగలను అధికారికంగా నిర్వహించి ప్రజల మనిషిగా కేసీఆర్ పేరొందారు. గత పాలకులు క్రైస్తవులను పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ నేతృత్వంలో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో దుస్తులను పంపిణీ చేశారు. పదేండ్లలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండేలా పాలించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారు. అన్నిమతాలకూ ప్రాధాన్యమిస్తూ ప్రజారక్షకుడిగా నిలిచిన సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని చెబుతున్నారు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్. నమస్తే తెలంగాణతో పంచుకున్న అభిప్రాయం ఆయన మాటల్లోనే...

\- నిజాంసాగర్, నవంబర్ 20

# ప్రజల పక్షపాతి సీఎం కేసీఆర్



## బీఆర్‌ఎస్‌ను కాపాడుకోవడం క్రైస్తవుల బాధ్యత

### అభివృద్ధిలో దూసుకుపోతున్న జుక్కల్

జుక్కల్ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందింది. తనకు ఈ నియోజకవర్గంతో చాలా సంబంధాలు ఉన్నాయి. పదేండ్లలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలయ్యాయి. నియోజకవర్గంలో 100 గ్రామాలకు రహదారులు, సరైన వంతెనలు లేక రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. అలాంటిది కేసీఆర్ కృషితో నేడు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారి వేశాం. వంతెనలు నిర్మించాం. ఇతర జిల్లాలకు జుక్కల్‌కు చాలా తేడా ఉంటుంది. ఇతర జిల్లాలకు సరిహద్దు ప్రాంతాలన్నీ తెలంగాణ జిల్లాలే కావడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుంది. ఇదే జుక్కల్‌కు మాత్రం సరిహద్దులో మహారాష్ట్ర , కర్ణాటక రాష్ట్రాలు ఉండడంతో అక్కడి ప్రభుత్వాలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలోనే జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలనూ కలుపుతూ రహదారులను వేశారు. విద్యా, వైద్యం, రహదారులు ఇలా అన్ని రంగాల్లో జుక్కల్ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నది. అభివృద్ధి పనులే జుక్కల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండే గెలుపునకు నాంది కాబోతున్నాయి.

### నమ్మకంతో పని చేసిన కేసీఆర్‌కు దేవుడు ప్రతిఫలం ఇస్తాడు..

సీఎం కేసీఆర్ ప్రజల విశ్వాసం చూరగొంటూ, నమ్మకంతో పదేండ్లు పాలించారు. అయనకు కచ్చితంగా దేవుడి ప్రతిఫలం దక్కుతుంది. మూడోసారి సీఎం కావడం ఖాయం. రాష్ట్రంలోని క్రైస్తవులతోపాటు ప్రజలంతా ఆయన పక్షానే ఉన్నారు. అందుకే కేసీఆర్ విజయం సాధిస్తారు. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కానరాని అభివృద్ధి..పదేండ్లలో కండ్లముందటే కనిపిస్తుంది.

### సంక్షేమం, అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించేందుకు కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వేలాది కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులే అండగా నిలుస్తాయి. జుక్కల్ నియోజకవర్గం నుంచి నాలుగోసారి హన్మంత్‌షిండే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయం. షిండే అందరికీ అందుబాటులో ఉంటూ చిన్నా పెద్ద తేడా లేకుండా అందరితో సౌమ్యుడిగా ఉంటారు. ఇతరులను బాధపెట్టే వ్యక్తి కాదు. అందుకే సీఎం సైతం షిండేను చాలా సౌమ్యుడని పలుమార్లు ప్రసంగాల్లో కొనియాడారు. 2014లో 35వేల మెజార్టీ, 2018లో 35వేల మెజార్టీతో విజయం సాధించిన షిండే ఈసారి ఎన్నికల్లో రెట్టింపు ఓట్లతో విజయం సాధిస్తారు.

### అన్నివర్గాల ప్రజలూ సంతోషంగా ఉన్నారు

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులతో ప్రజలూ సంతోషంగా ఉన్నారు. పింఛన్, దళితబంధు, కల్యాణలక్ష్మి, రైతుబీమా, కులవృత్తుల వారికి అండ, ఉచిత విద్యుత్ ఇలాంటి మరెన్నో పథకాలను అమలు చేస్తున్నందున రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. క్రైస్తవులు సైతం క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో పేదలకు దుస్తులను అందజేస్తున్నారు. రాష్ట్రంలో నూతన చర్చిలు, ప్రహరీల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించిన ఘనత సీఎందే.

### దళిత, బీసీ, మైనార్టీలకు ఆర్థిక చేయూత..

ఎస్సీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ఎంతో ఆలోచిస్తారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధును ప్రవేశపెట్టారు. ఈ పథకాలతో ఆయావర్గాల్లో అర్హులైన వారికి చేయూతనిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషిచేశారు. ప్రభుత్వ సహకారంతో ప్రస్తుతం ఆయావర్గాల ప్రజలు స్వయం ఉపాధి ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇలా అన్నిరకాలుగా చేయూతనిస్తూ అందరినీ సమానంగా చూడడం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుంది.

### మానవీయకోణంలో మ్యానిఫెస్టో..

బీఆర్‌ఎస్ సర్కారు పేదలు, అభాగ్యుల విషయంలో మానవీయకోణం చూపుతుంది. పింఛన్లను రూ.2వేలు చేసింది. మళ్లీ గెలిస్తే వృద్ధులకు రూ.5016, దివ్యాంగులకు రూ.6వేలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, ఎకరానికి రైతుబంధు ద్వారా రూ.16వేలు, రేషన్‌కార్డు ఉన్నవారికి సన్నబియ్యం, ఆరోగ్య బీమా రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15లక్షల వైద్య సదుపాయం పొందే అవకాశం ఇలా...ప్రజా సంక్షేమం కోసం బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారు.